నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, గురువారం 25 జనవరి 2024 | SURYAPET

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

- ఫిబ్రవరి మొదటి వారంలో నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాలు
- త్వరలో పూర్తి స్థాయి జిల్లా కమిటీల నియామకం
- రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్

కట్టంగూర్, జనవరి 24 : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పునకు కట్టుబడి ఉండడంతోపాటు జనం సమస్యల పరిష్కారంలో క్రియాశీలక పాత్ర పోషిస్తామని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. కట్టంగూర్‌లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని, 14 సంవత్సరాలు ఉద్యమం చేసినా రాదనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహా నాయకుడు కేసీఆర్ అన్నారు. రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా సాధించిన తెలంగాణ మొదటి సీఎంగా 10 సంవత్సరాలు భారత దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయనటువంటి వినూత్నమైన సంక్షేమ పథకాలను అమలు చేసి సబ్బండ వర్గాలకు అందించారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో సాగు, తాగునీరు, వైద్య, విద్య, విద్యుత్ రంగాల్లో ప్రగతి సాధించి కేంద్ర ప్రభుత్వ ద్వారా అవార్డులు పొందిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో 70 లక్షల సభ్యత్వాలు కలిగిన బలమైన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో పాటు ఇచ్చిన హామీలను గడువు ప్రకారం పూర్తి చేయాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పూర్తి చేయడంలో గానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేసే వరకూ పార్టీ పరంగా ప్రభుత్వాని నిలదీస్తామని చెప్పారు. ఇటీవల హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ సమావేశాలు నిర్వహించి కార్యకర్తలు, కిందిస్థాయి నాయకుల అభిప్రాయాలను తీసుకొని ఓటమి మీద సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా వారికి మరింత అండగా ఉండేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్ రావు పార్టీ నాయకుల సూచనలు తీసుకొని పార్టీ అధినేత కేసీఆర్‌కు విన్నవించినట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఫిబ్రవరి మొదటి వారంలో అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నట్లు, సమావేశాలకు కేసీఆర్, కేటీఆర్‌ను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటామని, ఉమ్మడి జిల్లా కమిటీలను త్వరలో ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. సమావేశంలో జడ్పీటీసీ తరాల బలరాములు, పామనుగుండ్ల సర్పంచ్ వడ్డె సైదిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు జానీపాషా, బీఆర్ఎస్ నాయకులు రెడ్డిపల్లి మనోహర్ పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

సాగర్ నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి

- రైతు సంఘం ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్‌కు వినతి

మిర్యాలగూడ, జనవరి 24: సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి ఎండుతున్న పంట పొలాలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే జూల కంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, కార్యదర్శి టి.సాగర్ కోరారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బుధవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో రైతులు వరి సాగు చేశారని, సాగు నీరు విడుదలవుతుందన్న ఆశలో మరికొందరు బోర్లు, బావుల కింద సాగు చేశారని మంత్రికి తెలిపారు. సాగర్ ప్రాజెక్టు నుంచి 15 టీఎంసీల నీటిని వాడుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

పది రోజులపాటు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని, అవసరమైతే కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి ఆల్మట్టి ద్వారా నీటిని తెప్పించి పంట పొలాలకు సాగునీటిని విడుదల చేయాలని విన్నవించారు. స్పందించిన మంత్రి అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారి వెంట సంఘం నాయకులు శోభన్, బసవయ్య తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజలను చైతన్యపర్చాలి

- ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

రామగిరి, జనవరి 24 : నేటి ఆధునిక సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే జనంలో చైతన్యం కల్పించాలని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రోగ్రాం అధికారులు కృషి చేయాలని ఎంజీయూ వీసీ సీహెచ్. గోపాల్‌రెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి జిల్లా కళాశాలల్లోని 163 ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం అధికారులకు ఎంజీయూ సమావేశ మందిరంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అన్ని యూనివర్సిటీల కంటే ఎంజీయూలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు చాలా బాగా నిర్వహిస్తున్నారని అభినందనలు తెలిపారు. సామాజిక రుగ్మతలను తొలగించి, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ పీఓలకు వివిధ అంశాలపై రిసోర్స్‌పర్సన్స్ శిక్షణ ఇచ్చారు. ఇటీవల మహారాష్ట్రలో నిర్వహించిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ఎంజీయూ నుంచి హాజరై ప్రతిభ చూపిన వలంటీర్లను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మద్దిలేటి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంజీయూ పాలక మండలి సభ్యులు బోయినపల్లి కృష్ణారెడ్డి, ఉమ్మడి జిల్లాలోని కళాశాలల పీఓలు పాల్గొన్నారు.

పాలేత చేపలు@15కేజీలు

మఠంపల్లి మండలంలోని యాతవాకిళ్లలో గల వేములూరి రిజర్వాయర్‌లో బుధవారం మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా పెద్ద పెద్ద పాలేత చేపలు వలకు చిక్కాయి. కేసీఆర్ ప్రభుత్వం మత్స్యకార్మికుల ఆర్థికాభివృద్ధి కోసం చెరువుల్లో వదిలిన చేప పిల్లలు నేడు ఒక్కొక్కటి సుమారు 10 నుంచి 15 కేజీల సైజు వరకు పెరిగినట్లు పేర్కొన్నారు. పాలేత చేపలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుందని, కిలోకు సుమారు రూ.400 వరకు ధర పలుకుతుందని తెలిపారు. భారీ చేపలు వలకు చిక్కడంపై మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.

– మఠంపల్లి, జనవరి 24

ఫిబ్రవరి 8 తర్వాత ఏ క్షణమైనా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావచ్చన్న సంకేతాల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు కసరత్తును మరింత ముమ్మరం చేశాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూనే లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం అవుతున్నట్లు స్పష్టం అవుతున్నది. ఉమ్మడి జిల్లా పరిధిలోని రెండు లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలను రచిస్తున్నాయి. రానున్న కాలంలో పట్టిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగేందుకు సన్నద్ధమవుతున్నాయి.

– నల్లగొండ ప్రతినిధి, జనవరి24(నమస్తే తెలంగాణ)

అందరి దృష్టి లోక్‌సభ ఎన్నికలపైనే..

వ్యూహాత్మకంగా బీఆర్ఎస్ అడుగులు

- ఇప్పటికే సమీక్షా సమావేశాలు పూర్తి
- నేడు హైదరాబాద్‌లో కాంగ్రెస్ బూత్ కమిటీలతో మీటింగ్
- కేంద్ర మంత్రులు, నేతలతో బీజేపీ హడావుడి
- వచ్చే నెలలోనే షెడ్యూల్ ప్రచారంతో కసరత్తు వేగవంతం

గతంలో పోలిస్తే లోక్‌సభ ఎన్నికలు అడ్వాన్స్‌గా రావచ్చని వార్తలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 8న కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల తుది జాబితాను ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో తుది జాబితా వెలువడిన అనంతరం ఎప్పుడైనా ఎన్నికల షెడ్యూల్ రావచ్చని సమాచారం. దాంతో అన్ని రాజకీయ పార్టీలు తమ కార్యాచరణను వేగవంతం చేశాయి. ఇందులో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే భువనగిరి, నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ప్రత్యేకంగా సమీక్ష సమావేశాలు కూడా పూర్తి చేసింది. నియోజకవర్గ పరిధిలోని కీలకమైన ప్రజాప్రతినిధులు, నేతలంతా ఇందులో భాగస్వాములయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పార్టీ శ్రేణులంతా ఎన్నికలకు సమాయత్తం అయ్యేలా దిశానిర్దేశం చేశారు. ఇక త్వరలోనే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కూడా సమావేశాల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఇదే విధంగా క్షేత్రస్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో ఎన్నికలకు రెడీ చేసేలా చర్యలు చేపడుతున్నారు. మరోవైపు ఎంపీ అభ్యర్థుల ఎంపిక పైనా పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పటికే కసరత్తు చేస్తున్నట్లు చర్చ సాగుతున్నది. అందరికీ ఆమోదయోగ్యంగా బలమైన అభ్యర్థులను త్వరలోనే ఖరారు చేస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఫలితాల ఊపుతో కాంగ్రెస్ పార్టీ కూడా లోక్‌సభ ఎన్నికలపై దృష్టి సారించింది. ఇప్పటికే భువనగిరికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండకు మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఇన్‌చార్జీలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. వీరి సారథ్యంలోనే పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో బూత్ లెవల్ కార్యకర్తల సమ్మేళనానికి ఏర్పాట్లు చేసింది. దీనికి బూత్ కమిటీల నుంచి మొదలుకుని అన్ని స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలను ఆహ్వానించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం దశలవారీగా ఎన్నికల వ్యూహ రచనతో ముందుకు సాగనున్నట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి లేదా కోమటిరెడ్డి కుటుంబంలో నుంచి ఒకరు అభ్యర్థిగా ఉండనున్నట్లు సమాచారం. నల్లగొండ నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డి లేదా పటేల్ రమేశ్‌రెడ్డిలో ఒకరు అభ్యర్థిగా బరిలో ఉంటారన్న చర్చ సాగుతున్నది. బీజేపీ సైతం లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా తమ కార్యక్రమాలను ముమ్మరం చేసింది.

ఇప్పటికే రెండు నియోజకవర్గాల పరిధిలో కేంద్ర మంత్రుల పర్యటనలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర పార్టీ నేతలు కూడా పార్టీ శ్రేణులతో భేటీ అవుతున్నారు. ఇటీవలే మూడు జిల్లాలకు కొత్త అధ్యక్షులను ప్రకటించారు. ఇక అయోధ్య రామ మందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఆధారంగా విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫిబ్రవరి రెండో వారంలో జిల్లా పరిధిలో ప్రధాని మోదీతో బహిరంగసభకు కూడా సన్నాహకాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. వీటన్నింటి ఆధారంగా ఉమ్మడి జిల్లా పరిధిలో గెలిచే అవకాశాలు లేకపోయినా బీజేపీ ఓటింగ్ శాతం పెంచుకుని ఉనికి చాటాలన్న లక్ష్యంతో కనిపిస్తున్నది. ఇక జిల్లాలో ఒకప్పుడు గెలుపోటముల్లో కీలకమైన సీపీఎం, సీపీఐ ఈ సారి పోటీ చేసే అవకాశాలు కనిపించడం లేదు. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించనున్నట్లు సమాచారం.

కొడుకును చంపిన తల్లికి జీవిత ఖైదు

నీలగిరి, జనవరి 24. వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని కన్న కొడుకునే కడతేర్చిన తల్లికి, ఆమెకు సహకరించిన ప్రియుడికి జీవిత ఖైదు విధిస్తూ బుధవారం జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి నాగరాజు తీర్పు ఇచ్చారు. జడ్జి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం బుద్దారం గ్రామానికి చెందిన పాలేటి వెంకన్న–విజయ దంపతులకు ఇద్దరు కుమారులు. వెంకన్న ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, విజయ గ్రామంలో కూలికి వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన తోకల వెంకట్‌రెడ్డితో విజయకు కొన్నేండ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. ఈ క్రమంలో 2020 ఫిబ్రవరి 21న విజయ కుమారుడు నాగరాజు అలియాస్ చింటు(9)చూశాడు. ఈ విషయాన్ని భర్త వెంకన్నతో చెబుతాడనే భయంతో నాగరాజును వెంకట్‌రెడ్డి కాళ్లు గట్టిగా పట్టుకోగా, విజయ టవల్‌తో నాగరాజు మెడకు చుట్టి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశారు. ఈ విషయాన్ని అనారోగ్యంతో చనిపోయాడని చిత్రీకరించేందుకు కడుపు నొప్పితో చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేశారు. బాలుడి మృతిపై అనుమానం వచ్చిన అప్పటి నల్లగొండ రూరల్ ఎస్ఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి దర్యాప్తు చేపట్టి కేసుకు సంబంధించిన ఆధారాలు సేకరించారు. ఇప్పటి ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి, సిబ్బంది సుమన్, సురేశ్, ఆంజనేయులు సాక్షులను కోర్టుకు తీసుకురాగా నేరాలు రుజువు కావడంతో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు.

కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ చందనాదీప్తి

నీలగిరి, జనవరి 24 : పోక్సో, గ్రేవ్ కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ చందనాదీప్తి పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమావేశం నిర్వహించి పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్(అండర్ ఇన్వెస్టిగేషన్) కేసుల్లో గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల్లో నాణ్యమైన విచారణ చేయాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశోధన చేశాకే కేసు ఫైనల్ చేయాలని సూచించారు. కేసులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ నాణ్యమైన, సత్వర సేవలు అందించాలన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని, దొంగతనాలు జరుగకుండా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. గంజాయి, జూదం, పీడీఎస్ బియ్యం రవాణాపై దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, రిపీటెడ్‌గా ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌బీ డీఎస్పీ సోమ్‌నారాయణ్ సింగ్, డీఎస్పీ విఠల్ రెడ్డి, నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదా, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ చందనాదీప్తి, హాజరైన పోలీస్ అధికారులు

నేటి నుంచి జాన్‌పహాడ్ ఉర్సు

- మూడు రోజులపాటు జాతర
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు

జాన్‌పహాడ్ దర్గా వద్ద చేసిన ఏర్పాట్లు

పాలకవీడు, జనవరి 24 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే జాన్‌పహాడ్ దర్గా ఉర్సు నేటి నుంచి ప్రారంభం కానున్నది. ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరిగే సైదులు బాబా ఉత్సవాలకు దర్గా నిర్వాహకులు, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏడాదికి ఒక సారి జనవరి చివరి మాసంలో జరిగే ఉర్సుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్ర ప్రదేశ్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ ఉత్సవాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.13 లక్షలు కేటాయించింది. ఉర్సును పురస్కరించుకొని దర్గాకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ పరిసరాలు దుకాణాల సముదాయాలతో కళకళలాడుతున్నాయి.

గుసూల్ షరీఫ్‌తో ప్రారంభం

ఉర్సులో తొలిరోజు గురువారం గుసూల్ షరీఫ్ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా సైదులు బాబా సమాధులు, దర్గా పరిసరాల్లో ఉన్న సిపాయిల సమాధుల మీద ఉన్న పాత చాదర్‌లను తొలగించి శుభ్రం చేస్తారు. అనంతరం సమాధులపై పూలు, దట్టీలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా గంధోత్సవం

ఉర్సులో ప్రధాన ఘట్టం గంధం మహోత్సవం. 26న శుక్రవారం ఘనంగా నిర్వహిస్తారు. గంధం కలశానికి పూజలు చేసి చందల్‌ఖానకు ఊరేగింపుగా వెళ్తారు. అక్కడ హైదరాబాద్ వక్ఫ్‌బోర్డు వారు తెచ్చిన గంధాన్ని తీసుకొని జాన్‌పహాడ్ గ్రామంలో ఊరేగింపుగా తిరుగుతూ దర్గా వద్దకు చేరుకొంటారు. పవిత్ర గంధాన్ని బాబా సమాధుల పెట్టి ప్రార్థనలు నిర్వహిస్తారు. గంధాన్ని తాకితే సంవత్సరం అంతా మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. 27న ఉదయం ప్రత్యేక దర్శనాల అనంతరం శనివారం సాయంత్రం దీపారాధనతో ఉర్సును ముగిస్తారు.

ప్రతి అరగంటకు ఆర్టీసీ బస్సు

ఉర్సుకు వచ్చే భక్తులకు ప్రయాణ ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది, సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ డిపోల నుంచి ప్రతి అరగంటకు ఒక బస్సు నడిచేలా ఏర్పాటు చేసింది. మిర్యాలగూడ డిపోకు చెందిన బస్సులను దామరచర్ల మీదుగా జాన్‌పహాడ్ దర్గాకు .. సూర్యాపేట, కోదాడ డిపోలకు చెందిన బస్సులను నేరేడుచర్ల మీదుగా నడుపుతున్నట్లు ఆయా డిపో మేనేజర్లు తెలిపారు.

అన్ని సౌకర్యాలు

దర్గా వద్దకు వచ్చే భక్తుల కోసం వివిధ శాఖలు అందుబాటులో ఉండనున్నాయి. వైద్యారోగ్య, పోలీస్, ఆర్టీసీ, అగ్నిమాపక, 108 సిబ్బంది ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశాయి. హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటాచారి ఏర్పాట్లపై అధికారులతో నిరంతరం సమీక్షిస్తున్నారు. తాగునీరు, పారిశుధ్య సమస్య రాకుండా రెవెన్యూ, పంచాయతీ అధికారులు అన్నీ సిద్ధం చేశారు. ఇక ఉత్సవాలకు 500 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నట్లు కోదాడ డీఎస్పీ ప్రకాశ్, హుజుర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి తెలిపారు. దర్గా పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దర్గా ఎదుట, లోపల ప్రత్యేక క్యూలైన్లు పెట్టించారు. శూన్యపహాడ్ రహదారి వెంబడి, జాన్‌పహాడ్ రోడ్ పెట్రోల్ బంక్ వద్ద పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు.

లక్షల విలువ చేసే ఎన్నెస్పీ ట్రాక్ ఐరన్ చోరీ

నందికొండ, జనవరి 24 : నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఎన్నెస్పీకి సంబంధించిన లక్షల విలువ చేసే ఐరన్ అపహరణకు గురైంది. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం హిల్ కాలనీలో నీటి సరఫరా చేసే ఫిల్టర్ హౌస్‌కు మోటర్ల కోసం దిగువన ఉన్న కృష్ణానదిలోకి ఐరన్‌తో ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. కృష్ణా నదిలో నీటి మట్టం పెరిగినప్పుడు ఐరన్ ట్రాక్ సహాయంతో మోటర్లను కిందికి పైకి జరిపే వారు. పైలాన్ కాలనీలో నూతనంగా ఫిల్టర్ హౌస్ నిర్మించినప్పటి నుంచి హిల్‌కాలనీలోని ఫిల్టర్ హౌస్ వాడకంలో లేదు. ఇదే అదనుగా గుర్తు తెలియని వ్యక్తులు కొంత కాలంగా గ్యాస్ సిలిండర్ల సహాయంతో కిలోమీటర్ల దూరం వరకు ఏర్పాటు చేసిన లక్షల విలువైన ఐరన్ ట్రాక్‌ను కట్ చేసి వాహనాల్లో తరలిస్తూ విక్రయిస్తున్నారు. ఇది గమనించిన స్థానికులు ఎన్నెస్పీ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హిల్‌కాలనీలో ఫిల్టర్ హౌస్ వాడకంలో లేకున్నా ఇక్కడ ఎన్నెస్పీకి సంబంధించిన సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. కిలోమీటర్ల దూరం వరకు ఏర్పాటు చేసిన ఐరన్ ట్రాక్ వెంబడి మనుషులు కూడా నడువడానికి ఇబ్బందిగా ఉంటుంది. అటువంటి ప్రాంతానికి గుర్తు తెలియని వ్యక్తులు ఎన్నెస్పీ సిబ్బంది సహాయం లేకుండా గ్యాస్ లిండర్లతో వెళ్లడం కష్ట తరమని, ట్రాక్ అపరహణలో ఎన్నెస్పీ సిబ్బంది ప్రమేయం కూడా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నెస్పీకి సంబంధించిన విలువైన ఆస్తులు, భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హిల్‌కాలనీ ఫిల్టర్ హౌస్ వద్ద కట్ చేయగా మిగిలిన ట్రాక్ ఐరన్ ముక్కలు